పప్పుధాన్యాల సాగు తగ్గుముఖం

- కలిసిరాని మెట్టపంటల సేద్యం
- అకాల వర్షాలే కారణం

పొదలకూరు : పొదలకూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో పప్పు ధాన్యాల సాగు గణనీయంగా తగ్గింది. అదనులో వర్షాలు కురిసినా, కురవక పోయినా కొంతకాలంగా మెట్టరైతులు అపరాల సాగు జోలికి వెళ్లడం లేదు. ప్రధానంగా మినుము, పెసర, పచ్చిశనగ, కంది పంటలను పొదలకూరు, రాపూరు, చేజర్ల, కలువాయి మండలాల్లో సాగు చేపడుతారు. ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో వర్షపాతాన్ని అనుసరించి రైతులు పప్పుధాన్యాల సాగు చేస్తుంటారు. ఫలితంగా రూ.కోట్లాది లావాదేవీలు ఈ ప్రాంతంలో పప్పుధాన్యాల సాగు వల్ల వ్యాపారులు, రైతుల మధ్య లావాదేవీలు నెలకొంటాయి. నాలుగు మండలాల్లో కలిపి సుమారు 20 వేల ఎకరాల్లో మినుము, పెసర పంటల సాగు చేపడుతుంటారు. దుక్కిదున్నకం పనుల నుంచి పంటలకు పురుగు మందుల పిచికారీ వరకు మెట్ట రైతులు సంక్రాంతి పండగ వరకు వ్యవసాయ పనుల్లో తలమునకలై ఉంటారు. అంతేకాక రబీ సీజన్ నవంబరు నుంచి ప్రారంభమైతే మాగాణి సేద్యం చేపట్టే రైతులకు ఊపిరిసలపని విధంగా వ్యవసాయ పనులు ఉంటాయి. అయితే ప్రస్తుతం ఖర్చులు పెరగడమే కాక అకాల వర్షాల వల్ల మినుము, పెసర చేతికి వస్తుందనే నమ్మకం సన్నగిల్లడంతో రైతులు సాగు



గతేడాది సాగులో ఉన్న మినుము పంట(ఫైల్)

విస్తీర్ణం గణనీయంగా తగ్గిస్తున్నారు.

ఆర్బీకేల ద్వారా అవగాహన

గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆర్బీకేల ద్వారా రైతులకు వ్యవసాయంపై అవగాహన కల్పించే వారు. ప్రధానంగా పంటల మార్పిడి పద్ధతికి రైతులు అలవాటు పడాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఇందుకోసం ఖరీఫ్‌లో మినుము, పెసర పంటలే సాగు చేయాల్సిన పనిలేదని, అంతర్‌పంటగా కందిని సాగు చేస్తే రైతులు నష్టపోవాల్సిన అవసరం ఉండదని అవగాహన కల్పిస్తున్నారు. గతంలో ఆర్బీకేల స్థాయిలో వ్యవసాయ సలహా మండలి సభ్యులతో ముందుగా వ్యవసాయాధికారులు మాట్లాడి వారి ద్వారా రైతులకు వివరించే వారు. ప్రస్తుతం సలహామండలీలను రద్దు చేసినట్టుగా తెలుస్తోంది. ఫలితంగా రైతులు పంటల మార్పిడికి మెల్లగా అలవాటు పడుతూ నష్టాలు చవిచూసే పంటలను సాగు చేయడం మానివేస్తున్నారు.

దుక్కిదున్నకాలే జరగలేదు



పప్పుధాన్యాల సాగుకు రైతులు ఇప్పటి వరకు దుక్కిదున్నకం పనులే మొదలు పెట్టలేదు. నిమ్మతోటల్లో అంతర్‌పంటగా కందిసాగు చేస్తే మంచి లాభాలు వచ్చే అవకాశం ఉంది. రైతులకు మెట్టపంటల సాగుపై త్వరలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. దుక్కిదున్నకం పనులు పూర్తి చేస్తే సెప్టెంబర్‌లో కురిసే వర్షాలకు పప్పుధాన్యాల విత్తనాలు విత్తుకునేందుకు వీలుకలుగుతుంది. పప్పుధాన్యాల విస్తీర్ణం పెంపొందించేందుకు రైతుల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. – ఎ.వాసు, ఏఓ, పొదలకూరు



ఆర్బీకేలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు(ఫైల్)

క్లుప్తంగా

పొన్నపూడిలో అవగాహన సదస్సు



మందుల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

విడవలూరు : మండలంలోని పొన్నపూడి గ్రామంలో ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన టీసీజీఎస్–1694 వేరుశనగ రకం ప్రదర్శన క్షేత్రాన్ని జిల్లా వ్యవసాయాధికారులు సందర్శించారు. అనంతరం ఆత్మ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.శివన్నారాయణ మాట్లాడుతూ వేరుశనగ సాగులో పచ్చిరొట్ట విత్తనాలైన జనుము పంటను వేసుకోవడం ద్వారా వేరుకుళ్లు, కాండం కుళ్లు తెగుళ్లను తగ్గించుకోవచ్చని తెలిపారు. అనంతరం రైతులకు నానో డీఏపీ వినియోగంపై ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కె.కిరణ్‌కుమార్‌రెడ్డి, మండల ఏఓ పి.వెంకటకృష్ణయ్య, ఇఫ్కో జిల్లా అధికారి వి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వెంకయ్యస్వామికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో స్వామివారు

మనుబోలు : మండల పరిధిలోని బీసీ కాలనీ సమీపంలో ఉన్న భగవాన్ శ్రీవెంకయ్యస్వామి ఆలయంలో స్వామివారికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి పంచామృతాభిషేకం జరిపించి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

డ్రాపౌట్ చిన్నారులను పాఠశాలల్లో చేర్పించాలి



మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

పొదలకూరు : బడి మానేసిన(డ్రాపౌట్) పిల్లలను తిరిగి పాఠశాలలో చేర్పించేందుకు అందరూ సహకరించాల్సిందిగా ఇన్‌చార్జి హెచ్‌ఎం ఏవీ సుధాకర్ కోరారు. పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కిట్ల పంపిణీ, విద్యాప్రమాణాల మెరుగు తదితర అంశాలపై ఆయన చర్చించారు. అనంతరం శిక్షా సప్తాహ్‌లో భాగంగా పాఠశాల ఆవరణలో విద్యార్థుల తల్లులతో మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏకో క్లబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఆదిశైవ బ్రాహ్మణ జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకారం

నెల్లూరు(బృందావనం): ఆంధ్ర రాష్ట్ర ఆదిశైవ(అర్చక) బ్రాహ్మణ జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని బాలాజీనగర్‌లోని వాకాటి నరసయ్య త్యాగరాజ కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండకావూరు శేషగిరిరావు, గుడ్లూరు ఫణికుమార్ శర్మ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా సంఘం చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించడంతో పాటు సంఘ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించనున్నట్లు వివరించారు. జిల్లాలోని సంఘీయులందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ధనలక్ష్మిపురంలో మెగా రక్తదాన శిబిరం నేడు

నెల్లూరు సిటీ: హెల్పింగ్ హ్యాండ్ సొసైటీ ఆధ్వర్యంలో ధనలక్ష్మిపురంలోని ఉన్నత పాఠశాలలో మెగా రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ సొసైటీ అధ్యక్షుడు కుంచాల విజయభాస్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదాతలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వరి పంట పరిశీలన



వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో సాగులో ఉన్న వరి పంటను కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ డి.విజయ్‌కుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వవ్వేరు గ్రామంలో వరి పంట ప్రస్తుతం వెన్నుదశలో ఉందని, ఎక్కువగా కాండం తొలుచు పురుగుతో ప్రమాదం ఉందన్నారు. దీని నివారణకు వ్యవసాయాధికారుల సూచనలు తప్పక పాటించాలని తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయాధికారులు మీరయ్య, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామికి అభిషేక పూజలు

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం రేవతి నక్షత్రం సందర్భంగా స్వామివారి మూలమూర్తికి విశేషాభిషేకం, పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా ఎం.శ్యామ్‌ప్రసాద్–లక్ష్మి దంపతులు వ్యవహరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

తల్లి పేరుతో మొక్కల పెంపకం

ఇందుకూరుపేట : మండలంలోని పల్లిపాడులో ఉన్న డైట్ కళాశాలలో శిక్షా సప్తాహ్‌లో భాగంగా ఆరో రోజు శనివారం ఛాత్రోపాధ్యాయులతో తల్లి పేరు మీద మొక్క నాటడం (ప్లాంట్ ఫర్ ఏ మదర్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రమేష్ మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం–2020ను రూపొందించి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విద్యా శాఖ, సమగ్ర శిక్ష విభాగాల ఆధ్వర్యంలో వారం రోజుల పాటు శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆరో రోజు తల్లి పేరు మీద మొక్కలు నాటినట్లు తెలియజేశారు. ఆయా మొక్కలకు వారి తల్లి పేరును ట్యాగ్ చేసి, వాటిని దత్తత తీసుకుని సంరక్షించే బాధ్యతను అప్పజెప్పినట్లు పేర్కొన్నారు.



మొక్క నాటుతున్న అధ్యాపకులు

కార్యక్రమంలో డైట్ కళాశాల సీనియర్ అధ్యాపకులు డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డాక్టర్ ఆర్.బాలాజీరావు, ఉపన్యాసకులు కె.విజయచంద్ర, ఎస్.శివ, ఎస్‌బీ దాస్, డి.నరసింగరావు, సి.సోమేశ్వర్, కె.షఫీ అహ్మద్, కార్యాలయ సూపరింటెండెంట్ ఎమ్.మేరీ ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్ట్ గోడౌన్‌లో తనిఖీలు

పొదలకూరు : నిషేధిత పురుగు మందులను ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీల ద్వారా వ్యాపారస్తులకు అందుతున్నాయనే సమాచారంతో ఏడీఏ కె.శివనాయక్, ఏఓ ఎ.వాసు శనివారం పట్టణంలోని నవతా ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ గోడౌన్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోదాములో ఉన్న వస్తువులను పరిశీలించారు. ఎలాంటి నిషేధిత పెస్టిసైడ్స్ దిగుమతి కాలేదని నిర్ధారించుకున్నారు. ప్రభుత్వం నిషేధించిన పురుగు మందులను వ్యాపారులు రైతులకు అందుబాటులో ఉంచితే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అధికారులు హెచ్చరించారు.



తనిఖీలు నిర్వహిస్తున్న ఏడీఏ, ఏఓలు

పౌష్టికాహారంతో ఆరోగ్యం



విద్యార్థులకు పౌష్టికాహారం అందజేస్తున్న గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు

తోటపల్లిగూడూరు : పాఠశాల విద్యార్థులకు తప్పక పౌష్టికాహారం అందించాలని, అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ కేఎస్ బాలాజీ సూచించారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సౌత్‌ఆములూరు ప్రాథమికోన్నత పాఠశాలలో పౌష్టికాహార దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌష్టికాహార లోపం వల్ల విద్యార్థుల్లో అనేక ఆరోగ్య సమస్యలు ఏర్పడుతాయన్నారు. దీనిపై పిల్లలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే శుభ్రత, ఆరోగ్య పరిరక్షణ విషయంలో విద్యార్థులకు తగిన సూచనలు అందించాలన్నారు. పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకుంటే విద్యార్థులు ఆరోగ్యవంతులుగా తయారవుతారన్నారు. ఈ విషయంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకొని పిల్లలకు పోషకాహారాన్ని అందించాలన్నారు. అనంతరం గ్రామ పెద్దలు విద్యార్థులకు పోషకాహార పదార్థాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు చెరుకూరు శ్రీనివాసులునాయుడు, సర్పంచ్ చెరుకూరు సరళకుమారి, ఉప సర్పంచ్ చావా సుధారాణి, నాయకులు చావా రమేష్‌నాయుడు, ఈఓపీఆర్డీ అజీజ్, పంచాయతీ కార్యదర్శి విజయదుర్గ, పాఠశాల హెచ్‌ఎం అహ్మద్‌బాషా, పాఠశాల కమిటీ చైర్మన్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతిగృహం మార్పు

సాక్షి ఎఫెక్ట్..

మనుబోలు : మనుబోలు మండల కేంద్రంలో శిథిలావస్థలో ఉన్న బాలికల వసతిగృహాన్ని బాలుర వసతిగృహానికి మార్పు చేశారు. బాలికల వసతి గృహంలో పలు గదులు దెబ్బతిని పెచ్చులూడి పడుతుండడంతో విద్యార్థినులు భయం భయంగా గడుపుతున్న వైనాన్ని గత నెల 18న సాక్షి దినపత్రికలో ప్రత్యేక కథనాన్ని ప్రచురించిన విషయం విధితమే. దీనిపై స్పందించిన జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు విద్యార్థుల సంఖ్య నామమాత్రంగా ఉన్న బాలుర వసతిగృహాన్ని బాలికలకు కేటాయించారు. అలాగే బాలుర వసతిగృహంలో కేవలం 15 మంది విద్యార్థులు మాత్రమే ఉండడంతో వారికి ఒకటి రెండు గదులు సరిపోతున్నందున వారిని బాలికల వసతిగృహానికి మార్పు చేశారు. వసతిగృహం మార్పుపై బాలకలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



బాలికలకు కేటాయించిన బాలుర వసతిగృహం

నేడూ విద్యుత్ బిల్లులను చెల్లించొచ్చు

కొడవలూరు : మండలంలోని అన్ని విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు ఆదివారం కూడా యథావిధిగా పనిచేస్తాయని ఏఈ ఎం.రాములు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికీ విద్యుత్ బిల్లులు చెల్లించని వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని చెల్లించాలన్నారు. లేనిపక్షంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారని హెచ్చరించారు.

పేదలకు అన్నదానం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని రాఘవరెడ్డి కాలనీలో ఏర్పాటు చేసిన పీర్ల చావడి వద్ద నిర్వాహకులు శనివారం పేదలకు అన్నదానం చేశారు. తొలుత పీర్ల చావడి వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ముస్లిం మతపెద్దలు మాట్లాడుతూ 13 సంవత్సరాలుగా కాలనీలో పీర్లపండగ చేస్తున్నామన్నారు. అందులో భాగంగా పేదలు, వృద్ధులకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక యువత పాల్గొన్నారు.

నిమ్మ యార్డులో విజిలెన్స్ డీడీ తనిఖీలు

పొదలకూరు : స్థానిక నిమ్మమార్కెట్ యార్డులో గుంటూరు మార్కెటింగ్‌శాఖ విజిలెన్స్ డీడీ ఝాన్సీ శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాపారస్తులు ఉంటున్న దుకాణాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యాపారులకు కేటాయించిన దుకాణాల్లో బయటి వ్యక్తులు వచ్చి వ్యాపారాలు చేసుకుంటున్నారని ఫిర్యాదులు అందడంతో డీడీ తనిఖీకి వచ్చినట్లుగా తెలిసింది. మీడియాకు ఎలాంటి సమాచారం అందజేయకుండా గోప్యంగా ఉంచి ప్రతి దుకాణానికి వెళ్లి విచారణ నిర్వహించారు. వ్యాపారాలు చేసుకుంటున్న వారి వద్ద వివరాలు సేకరించడంతో పాటు బాడుగలు ఎవరికి చెల్లిస్తున్నారని నిలదీశారు. కొందరు చాలాకాలంగా ఇతరుల పేరుపై ఉన్న దుకాణాల్లో వ్యాపారం చేసుకుంటూ వారికి అద్దెలు చెల్లిస్తున్నట్లు డీడీ విచారణలో బహిర్గతం అయినట్లుగా తెలిసింది. దీంతో వారి వివరాలను సేకరించి వారి లైసెన్సులను రద్దు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. విజిలెన్స్ డీడీ వెంట మార్కెట్ ఏడీ అనితాకుమారి, డీఈ వినోద్‌కుమార్, సెక్రటరీ నవీన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

టెటానస్ వ్యాక్సిన్‌తో ధనుర్వాతం దూరం



యల్లాయపాళెం హైస్కూల్లో టెటానస్ వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

కొడవలూరు : టెటానస్ వ్యాక్సిన్‌తో ధనుర్వాతం దూరమవుతుందని హెచ్‌ఈఓ కోటేష్ తెలిపారు. మండలంలోని యల్లాయపాళెం హైస్కూల్‌లో స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో 10 నుంచి 16 సంవత్సరాల వయస్సున్న విద్యార్థులకు ధనుర్వాతం రాకుండా శనివారం టెటానస్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనుర్వాతం అనేది నాడీ వ్యవస్థపై దాడి చేసే విషపూరిత బ్యాక్టీరియా వల్ల సంక్రమిస్తుందన్నారు. దీనివల్ల మెడ, దవడ కండరాల చుట్టూ సంకోచాలు ఏర్పడుతాయని తెలిపారు. టెటానస్ బ్యాక్టీరియా మట్టి, దుమ్ము లేదా పేడలో ఉంటుందన్నారు. టెటానస్ వ్యాక్సిన్‌తో ప్రపంచ వ్యాప్తంగా ధనుర్వాతం కేసులు గణనీయంగా తగ్గాయన్నారు. అయితే అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఈ వ్యాధి కొనసాగుతోందని తెలిపారు. వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా ఈ వ్యాధికి చెక్ పెట్టవచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎస్ సురేంద్ర, ఏఎన్‌ఎంలు సుకన్య, మహేశ్వరి, హెచ్‌ఎం మోహన రామలింగయ్య, పీఈటీ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు సునీల్, కృష్ణసుధా, సుజాత పాల్గొన్నారు.

నిర్మాణ దశలో హెచ్చరిక బోర్డులు పెట్టాలి

- ఎంఈఓ వసంతకుమారి

కొడవలూరు : నిర్మాణ దశలో ఉండే పాఠశాల భవనాల వద్ద పిల్లలు వెళ్లొద్దంటూ హెచ్చరిక బోర్డులను విధిగా ఏర్పాటు చేయాలని ఎంఈఓ జి.వసంతకుమారి ఆదేశించారు. మండలంలోని రెడ్డిపాళెం హైస్కూల్, నార్తురాజుపాళెం, గుండాలమ్మపాళెం, సంజీవ నగర్, గౌతమ్ నగర్, గండవరం దర్గా సంఘం, టపాతోపు ప్రాథమిక పాఠశాలల్లో భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ పాఠశాలలను శనివారం ఆమె సందర్శించి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు పలు సూచనలు చేశారు. నెల్లూరులోని కేఎస్‌ఆర్ పాఠశాలలో భవనం కూలి విద్యార్థి మృతిచెందిన నేపథ్యంలో అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత హెచ్‌ఎంలదేనన్నారు. నిర్మాణం జరిగే చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు పిల్లలు అటు వైపు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అంతేకాకుండా నిర్మాణంలో నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు అమలు జరిగేలా చూడాలని ఆదేశించారు. ఆమె వెంట హైస్కూల్ హెచ్‌ఎం అన్నపూర్ణమ్మ, ఉపాధ్యాయులు ఉన్నారు.



రెడ్డిపాళెంలో నిర్మాణంలో ఉన్న స్కూల్ భవనం వద్ద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయించిన ఎంఈఓ

అధ్యాపకుడికి సన్మానం

ఇందుకూరుపేట : పల్లిపాడు డైట్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న బంకా శ్రీనివాసులు సైకాలజీ విభాగంలో చేసిన పరిశోధనకు తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను అందించింది. ఈ క్రమంలో డైట్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.రమేష్, అధ్యాపక సిబ్బంది, ఛాత్రోపాధ్యాయులు శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు కె.వెంకటేశ్వరరావు, ఆర్.బాలాజీరావు పాల్గొన్నారు.



అబ్దుల్ కలామ్ జీవితం స్ఫూర్తిదాయకం

వెంకటాచలం : మాజీ రాష్ట్రపతి దివంగత ఏపీజే అబ్దుల్‌కలామ్ జీవితాన్ని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని వీఎస్‌యూ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ఎస్.విజయభాస్కర్‌రావు పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ)లో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత కలామ్ విగ్రహానికి వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీతో పాటు పలువురు అధ్యాపక సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలామ్ సేవలను కొనియాడారు. దేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన వ్యక్తిగా గుర్తింపు పొందారని కొనియాడారు. భారతదేశాన్ని అగ్రగామిగా నిలిపేందుకు అబ్దుల్ కలామ్ చేసిన కృషి మరువలేనిదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ విజయ, కావలి పీజీ సెంటర్ కళాశాల ప్రిన్సిపల్ వీరారెడ్డి, వీఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఆర్.మధుమతి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



వెంకటాచలం : వీఎస్‌యూలో అబ్దుల్ కలామ్ వర్ధంతి వేడుకల్లో పాల్గొన్న ఇన్‌చార్జి వీసీ విజయభాస్కర్‌రావు, తదితరులు

కలామ్ సేవలు మరువలేనివి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా, భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ సేవలు మరువలేనివని బీజేపీ నాయకులు అన్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో కలామ్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేశరక్షణ కోసం నిరంతరం పాటుపడిన వ్యక్తి కలామ్ అని కొనియాడారు. భారత సైన్యానికి అగ్ని, పృథ్వీ, నాగ, త్రిశూల్, ఆకాశ్ వంటి మిస్సైల్స్‌ను అందించారని వివరించారు. రాష్ట్రపతిగా ఉన్న సమయంలో నిరాడంబర జీవితాన్ని గడిపిన మహోన్నత వ్యక్తి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మైనారిటీ మోర్చ జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌బాషా, మండలాధ్యక్షుడు రఘురామయ్య, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పెంచలప్రసాద్, మండల, జిల్లా కార్యదర్శులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: కలామ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు